ఈనాడు
యాదాద్రి భువనగిరి
శుక్రవారం సెప్టెంబరు 27, 2024

రూ.750 కోట్లతో

పర్యాటక ప్రాంతాల అభివృద్ధి

'ఈనాడు'తో పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి

ముఖాముఖి



పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రూ.750 కోట్లను కేటాయించామని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. ఇందులో రూ.500 కోట్లను ఒక్క రాష్ట్ర ప్రభుత్వమే ఇచ్చిందని, మిగిలిన నిధులు కేంద్రం ద్వారా వస్తున్నాయన్నారు. పలు చారిత్రక ప్రాంతాల్లో ఇప్పటికే ఈ నిధులతో పలు పనులు మొదలయ్యాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధిని గత భారాస ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆయన 'ఈనాడు'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

రూ.100 కోట్లతో సాగర్ అభివృద్ధి..

✦ నాగార్జునసాగర్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.100 కోట్లను కేటాయించాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టితో ఈ ప్రాంతాన్ని పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి చేస్తున్నారు. బుద్ధవనం, ప్రాజెక్టులో ద్వీపంగా ఉన్న చాకలిగట్టును ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందించాం. ఈ (చాకలిగట్టు)ద్వీపానికి చేరుకునేందుకు తీరం నుంచి ప్రత్యేకంగా బోట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

✦ సాగర్‌కు వచ్చే పర్యాటకుల కోసం ప్రస్తుతమున్న విజయ్‌విహార్ హోటల్‌ను విస్తరించడంతో పాటూ మరో రెండు హోటళ్లను ఏర్పాటు చేయనున్నాం. బుద్ధవనంలోనూ త్వరలోనే మూడు నక్షత్రాల హోటల్ రాబోతోంది. సాగర్ ప్రాజెక్టుతో పాటూ వెనక జలాలు ఉన్న వైజాగ్‌కాలనీని సైతం పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం. ఇక్కడ ఏకో టూరిజంతో పాటూ కాటేజీల నిర్మాణం, వ్యూ పాయింట్‌లను ఏర్పాటు చేస్తాం. ఏడాదిలోపు ఈ పనులన్నీ పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం.

వచ్చే నెలాఖరులోగా రోప్‌వే టెండర్లు..

❑ భువనగిరి కోటపైకి రోప్‌వేను ఏర్పాటు చేయడానికి రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నాం. అక్టోబరు నెలాఖరులోపు టెండర్ల ప్రక్రియ పూర్తై పనులు ప్రారంభం కానున్నాయి. కోట కింద ఇన్నాళ్లు భూ సమస్య ఉండటంతో రోప్‌వే ఏర్పాటులో జాప్యం జరిగింది. దాన్ని త్వరలోనే పరిష్కరిస్తాం. కింద ఫుడ్‌కోర్టులతో పాటూ పర్యాటకులకు వసతి, బస కల్పించేందుకు వీలుగా హోటళ్ల నిర్మాణం చేయాలనే ఆలోచన ఉంది.

ఆధ్యాత్మిక సర్క్యూట్‌గా యాదాద్రి..

భువనగిరి, యాదాద్రి, కొలనుపాక, రాజపేటను కలుపుతూ పర్యాటక, ఆధ్యాత్మిక సర్క్యూట్‌గా ఏర్పాటు చేస్తాం. అందుకు ప్రతిపాదనలన్నీ సిద్ధమయ్యాయి. హైదరాబాద్‌తో పాటూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఈ సర్క్యూట్‌ను వీక్షించేందుకు ప్రత్యేకంగా ప్యాకేజీలు నిర్ణయిస్తాం. దీని వల్ల ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనల మేరకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటాం.

ఆదాయ మార్గాలపై అన్వేషణ

ఉమ్మడి నల్గొండ జిల్లాలో కృష్ణా పరివాహక ప్రాంతాలతో పాటూ రాచకొండ గుట్టలను అభివృద్ధి చేస్తే పర్యాటకులు పెరిగి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే వీలుండేది. గత పదేళ్లు ఈ ప్రాంతాలను నిర్లక్ష్యం చేశారు. చారిత్రక కట్టడాలతో పాటూ పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ప్రతి ప్రాంతానికో నివేదికను తయారు చేస్తున్నాం. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే ప్రాంతాలపై మొదట దృష్టి పెట్టాం.

- ఈనాడు, నల్గొండ:

పచ్చందాల ఒడిలో.. రాచకొండ

పచ్చని కొండలు, ఆకట్టుకునే నిర్మాణాలు, జాలువారే సెలయేర్లు.. పక్షుల రావాలు.. ఇవ్వన్నీ ఎక్కడో డిస్కవరీ ఛానల్‌లో చూసే అందాలు కాదండి.. రాచకొండలోనే కొలువుదీరాయి. చారిత్రక కట్టడాలు, ప్రకృతి అందాలకు నెలవైన ఈ ప్రాంతం సంస్థాన్ నారాయణపురం మండలంలో ఉంది. హైదరాబాద్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఈ ప్రదేశాన్ని పర్యాటక కేంద్రంగా గుర్తించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, సంస్థాన్‌నారాయణపురం



నడిపించేవారు లేక.. నరకయాతన..!

● వైద్యులు, ఆపరేటర్లు లేక మూలకు పడ్డ యంత్రాలు

పరిశీలన

ఈనాడు, నల్గొండ - న్యూస్‌టుడే, నల్గొండ అర్బన్, సూర్యాపేట (తాళ్లగడ్డ), భువనగిరి గంజ్: రోగులకు కార్పొరేట్ వైద్యం అందించాల్సిన జిల్లా ప్రధాన ఆసుపత్రుల్లో అజమాయిషీ లేకపోవడంతో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ.లక్షల విలువైన పరికరాలున్నా వాటిని నిర్వహించే వైద్యులు, ఆపరేటర్లు లేకపోవడంతో అవి మూలకుపడ్డాయి. నల్గొండ, సూర్యాపేట, భువనగిరిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రు(జీజీహెచ్)లను 'ఈనాడు' గురువారం పరిశీలించగా.. పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.


నల్గొండ: రక్తనమూనాల పరీక్షల కేంద్రం వద్ద ఇలా..


నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

నల్గొండ జీజీహెచ్‌లో...

☛ గుండె రోగులను పరిశీలించే 2డీ ఇకో, ఈసీజీ మిషన్లు పనిచేయడం లేదు. గుండె సంబంధిత వైద్యుడు (కార్డియాలజిస్టు) లేకపోవడంతో వీటిని పట్టించుకునేనాథుడు లేదు. దీంతో రూ.లక్షల విలువైన పరికరాలు వృథాగా పడి ఉన్నాయి.

☛ ఆపరేషన్ల సమయంలో మనిషి ఎక్స్‌రే ఫొటోలను కచ్చితంగా గుర్తించే సీ - ఆర్మ్ మిషన్ నిరుపయోగంగా మారింది. సుమారు రూ.13 లక్షలకు పైగా విలువ చేసే మిషన్ పనిచేయకపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

☛ ఆసుపత్రిలో ప్రస్తుతం అంతా ఇన్‌ఛార్జుల పాలనే సాగుతోంది. గత ఏడు నెలల్లో నలుగురు సూపరింటెండెంట్లు మారగా.. వైద్య కళాశాల ప్రిన్సిపళ్లు సైతం ముగ్గురు మారారు. ఆసుపత్రిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన ఆర్ఎంవోలు మొత్తం 8 మంది ఉండాల్సి ఉండగా..ఐదుగురు మాత్రమే ఉన్నారు.

☛ కీలకమైన డయాలసిస్ కేంద్రంలో మూత్రపిండాల నిపుణులు లేరు. ప్రస్తుతం సాంకేతిక నిపుణుడితోనే ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.

☛ మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఓపీకి వచ్చే సామాన్యులంతా బయట ప్రైవేటు మెడికల్ దుకాణాల్లోనే మందులు కొనుగోలు చేస్తున్నారు.

☛ మందుల సరఫరాతో పాటూ రోగులకు భోజనం అందించే కాంట్రాక్ట్ కాలపరిమితి ముగిసి మూడు నెలలు గడిచినా కొత్తగా టెండర్లు పిలవడం లేదు.

☛ ఇటీవల జరిగిన బదిలీల అనంతరం వైద్య, విద్య సంచాలకుల పరిధిలో మొత్తం 77 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం కేవలం 33 మందే ఉన్నారు. మిగిలిన 44 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

☛ వైద్య విధాన పరిషత్‌లో సివిల్ సర్జన్ స్పెషలిస్టులు 62 ఉండాలి. కానీ ప్రస్తుతం 39 మంది ఉండగా.. 23 ఖాళీలున్నాయి. డిప్యూటీ సివిల్ సర్జన్‌లు 34 మంది ఉండాల్సింది..ప్రస్తుతం 8 మంది ఉండగా. .26 ఖాళీలున్నాయి. సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 121 గానూ ప్రస్తుతం 21 మందే ఉండగా... 100 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

భువనగిరిలో...

◆ భువనగిరిలో గత ప్రభుత్వం వైద్యకళాశాలను ఏర్పాటు చేయగా.. ఇటీవల అనుమతులు వచ్చాయి. మొత్తం 220 పడకలు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 100 పడకలే ఉన్నాయి. ఇప్పుడున్న భవనాలపైనే మరికొన్నింటినీ నిర్మిస్తున్నారు.

◆ ఇక్కడ కాన్పులకు సంబంధించిన శస్త్రచికిత్సలు మాత్రమే కొనసాగుతున్నాయి. ఇతర అత్యవసర సేవలు అందుబాటులో లేవు. దీంతో ఇక్కడకు వచ్చిన రోగులను హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియాలకు పంపుతున్నారు. ఇందులో జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగిన వారే ఎక్కువగా ఉన్నారు.

◆ వైద్య కళాశాల నిర్మాణానికి యాదగిరిగుట్ట పురపాలిక పరిధిలో 20 ఎకరాలకు కేటాయించారు. పనులు జరగాల్సి ఉంది.

◆ జిల్లా ఆసుపత్రి నుంచి వైద్యకళాశాలగా మారడంతో వైద్యులు సరిపడనంత మంది ఉన్నారు. ఆపరేషన్లకు సదుపాయాలు లేకపోవడంతో ఉన్నవారూ సర్జరీలు చేయడానికి వీలు పడటంలేదు.

సూర్యాపేటలో...

❑ సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రూ.లక్షలు విలువ కలిగిన యంత్రాలు అందుబాటులో ఉన్నప్పటికీ.. అర్హత కలిగిన సిబ్బంది లేకపోవడంతో అవి నిరూపయోగంగా మారాయి. రొమ్ము క్యాన్సర్‌ను నిర్ధారించే మమోగ్రాఫ్ యంత్రం ఉన్నప్పటికీ దానిని నిర్వహించే నిపుణుడైన ఆపరేటర్‌లేకపోవడంతో అది మూలకు చేరింది. గుండె సంబంధిత నిపుణుడైన వైద్యుడితో పాటూ నెఫ్రాలజీ వైద్యులు లేరు. రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా చితికిపోతున్నారు.

❑ మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. వైద్యులు రాసిచ్చిన మందుల చిట్టీని ఫార్మసీలో అందిస్తే ఎరుపురంగు పెన్నుతో టిక్‌పెట్టి అవి బయట తాము చెప్పిన మందుల దుకాణంలోనే తీసుకోవాలని రోగులకు చెబుతున్నారు. రక్త పరీక్ష కేంద్రాల్లో నమూనాలు సేకరించేందుకు అవసరమయ్యే సిరంజీలూ అందుబాటులో లేవు.

❑ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు శస్త్రచికిత్స చేయాలంటే రోగులే సిరంజీలు, చేతి గ్లౌజులు, కావాల్సిన మందులను సమకూర్చుకోవాల్సి వస్తోంది.ఇటీవల బదిలీలు జరగడంతో సీనియర్ వైద్యులంతా వెళ్లిపోగా.. జూనియర్ వైద్యులతోనే ప్రస్తుతం నెట్టుకొస్తున్నారు.

సమన్వయంతోనే బాలల హక్కుల పరిరక్షణ

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత అన్నారు. ప్రపంచ బధిరుల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ, రెడ్‌క్రాస్ సొసైటీ, జిల్లా వైద్య ఆరోగ్య, మున్సిపల్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో భువనగిరి ప్రభుత్వ బాలికల ఎస్టీ పాఠశాలలో చట్టాలపై అవగాహన, స్వచ్ఛత వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి కవిత మాట్లాడుతూ.. బాలల హక్కులు, సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. డాక్టర్ అనిల్ మాట్లాడుతూ.. వినికిడి లోపం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. జిల్లా గిరిజన సంక్షేమాధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణ, పరిసరాలు శుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని, లక్ష్యసాధనకు చిన్నప్పటి నుంచి చదువుపై శ్రద్ధవహించాలన్నారు. కార్యక్రమంలో భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్, రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ బాలాజీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ఉపేందర్, న్యాయవాది రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి కవిత

చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి: కలెక్టర్

భువనగిరి, న్యూస్‌టుడే: తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ హన్మంత్ కె.జెండగే అన్నారు. ఐలమ్మ 129వ జయంతి వేడుకలను కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి కలెక్టర్, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెట్టిచాకిరికి వ్యతిరేకంగా, భూమి, భుక్తి కోసం చేసిన పోరాటాలను గుర్తుచేస్తూ వారి ఆశయాలను సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వారి పోరాటాలు, ఆశయాలు అందరికీ తెలియాలని రాష్ట్ర ప్రభుత్వం ఐలమ్మ జయంతిని వేడుకల ఘనంగా నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా వెనుకబడి తరగతుల అభివృద్ధి అధికారి యాదయ్య పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో చాకలి ఐలమ్మ జయంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ హన్మంత్ కె.జెండగే

ప్రేమించటం లేదని యువకుడి ఉన్మాదం

ఉప్పల్: యువతి తనను ప్రేమించడం లేదంటూ ఓ యువకుడు తనకు తాను కత్తితో గాయపర్చుకోగా.. పెనుగులాటలో ఇంజినీరింగ్ విద్యార్థినికి గాయమైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలం హనుమపురానికి చెందిన రాగల సాయికుమార్ (24) ప్రైవేటు ఉద్యోగి. ఇదే గ్రామానికి చెందిన విద్యార్థిని నగరంలో ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతోంది. వీరిద్దరిది ఒకే గ్రామం కావడంతో ఇద్దరి మధ్య స్నేహం ఉంది. కొన్ని రోజులుగా ఆమె సాయికుమార్‌ను దూరం పెడుతూ వస్తోంది. దీంతో తనను కాకుండా వేరే ఎవరినైనా ప్రేమిస్తుందనే అనుమానం పెంచుకున్నాడు. గురువారం మెహిదీపట్నం వెళ్లి ఆమెను కలిశాడు. ఇద్దరూ కలిసి భువనగిరి వెళ్లేందుకు ఉప్పల్‌కు వచ్చారు. ఇక్కడి బస్టాండ్ ప్రాంతంలోనే ఓ షాపులో సాయికుమార్ కత్తిని కొని జేబులో పెట్టుకున్నాడు. ఆమె చేతిలో ఉన్న ఫోన్‌ను లాక్కుని ఎవరికి ఫోన్ చేస్తుందో చూసే ప్రయత్నం చేయగా ప్రతిఘటించింది. దీంతో కోపోద్రిక్తుడైన సాయికుమార్ కత్తితో చేతిపై తనకు తాను గాయపర్చుకున్నాడు. ఫోన్‌ను లాక్కునే క్రమంలో ఆమె చేతి వేలికి గాయమైంది. అక్కడున్న వారు డయల్ 100కు ఫోన్ చేయడంతో ఉప్పల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువకుడిని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. కొన్ని రోజులుగా యువతి తనను దూరం పెడుతుండటంతో ఆమె సమక్షంలోనే ఆత్మహత్య చేసుకునేందుకే కత్తి కొనుక్కున్నట్టు పోలీసుల విచారణలో చెప్పాడు. యువతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఖైదీలు న్యాయసేవలు వినియోగించుకోవాలి

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: న్యాయవాదులను నియమించుకోలేని రిమాండ్ ఖైదీలు జిల్లా న్యాయసేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకొని న్యాయ సేవలు వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు ఎ.జయరాజు సూచించారు. భువనగిరి సబ్‌జైలును గురువారం సాయంత్రం సందర్శించారు. ఖైదీలతో ఆయన మాట్లాడారు. వివిధ కేసుల్లో ఉన్న ఖైదీలు న్యాయవిచారణకు హాజరవుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. జైలులో ఖైదీల సదుపాయాలు, వసతులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవిలత, జడ్జిలు నాగేశ్వరరావు, కవిత పాల్గొన్నారు.


సబ్‌జైలులోని వసతులు పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు, జడ్జిలు మాధవిలత, నాగేశ్వరరావు, కవిత

స్వయంభువులకు నిత్యారాధనలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రిలో గురువారం గర్భాలయంలో పంచనారసింహులను ఆరాధిస్తూ, నిత్య పూజలను శాస్త్రరీత్యా కొనసాగించారు. వేకువ జామున సుప్రభాతం చేపట్టిన పూజారులు స్వామి కొలువై ఉన్న ఆలయ ద్వారాలను తెరిచి, మూలవరులను కొలుస్తూ ఆస్థానపరంగా బిందెతీర్థం, హారతి నివేదన క్రతువు నిర్వహించారు. పంచామృతంతో స్వయంభువులకు నిజాభిషేకం నిర్వహించాక, తులసీ పత్రాలతో అర్చన చేపట్టారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శన మూర్తులకు స్వర్ణ పుష్పార్చన జరిపారు. వేద, మంత్ర పఠనంతో ఆలయ మహాముఖ మండపంలో యజ్ఞమూర్తులను కొలుస్తూ సువర్ణ పుష్పార్చన పర్వాలు కొనసాగించారు. శ్రీసుదర్శన నారసింహహోమం నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని ఆచారంగా చేపట్టారు. సాయంత్రం వేళ అలంకార సేవలు నిర్వహించారు. రాత్రి స్వయంభువులను కొలుస్తూ ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. దర్బారు సేవోత్సవంలో ఆలయ నిత్యాదాయం వెల్లడించారు. అనుబంధ ఆలయాల్లో నిత్య ఆరాధనలు నిర్వహించారు. భక్తుల రాక గణనీయంగా తగ్గడంతో దర్శన వరుసల సముదాయం, మండపాలు బోసిపోయాయి. మాడవీధుల్లో భక్త జన సంచారం లేక వెలవెలబోయింది. ఆలయ ఖజానాకు నిత్యాదాయం రూ.7,25,882 చేకూరింది.


← అలంకార సేవా పర్వం

ఏ నెయ్యి కావాలి.. నారసింహా..?

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: కల్తీ నెయ్యితో తయారైన తిరుపతి లడ్డూ వివాదం తెలుగు రాష్ట్రాల్లోని దేవాలయాలలో ప్రసాదాల తయారీ విధానాలపై కీలక చర్చ, మార్పులకు తెర తీయనుంది. భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆలయాల్లో అవసరమైన చర్యలు చేపట్టేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. వసతుల కల్పనతో పాటు, సేవలు అందించేందుకు నిర్వాహకులు తగు చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ సూచిస్తోంది. తాజాగా అన్ని దేవాలయాలలో వినియోగిస్తున్న నిత్యావసర సరకుల నాణ్యతా ప్రమాణాలపై ఆరా తీశారు. పెద్ద దేవాలయాలలో నెలసరి కావాల్సిన సరకులు, వాటిని కొనుగోలు చేస్తున్న తీరుపై నివేదికలు తెప్పించుకున్నట్లు సమాచారం. నాణ్యత పరిశీలనకు నెయ్యి, ఇతర సరకులను ప్రయోగశాలకు పంపించారు. నివేదికల ఆధారంగా పాలకుల ఆదేశాలతో అవసరమైన చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ యోచిస్తోంది.

☆ ప్రైవేట్ సంస్థల నుంచి కాకుండా ప్రభుత్వ సంస్థ అయిన విజయ డెయిరీ నెయ్యిని ప్రసాదాల తయారీ కోసం వినియోగించాలని రాష్ట్రంలోని దేవాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఏ డెయిరీ నెయ్యిని కొనుగోలు చేయాలన్నదే ఆలయాల నిర్వాహకుల ఆలోచన. ప్రభుత్వం విజయ డెయిరీ నెయ్యిని కొనుగోలు చేయాలని, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే అయిలయ్యలు మాత్రం మదర్ డెయిరీ నెయ్యినే వాడాలంటున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రసాదాల తయారీ కోసం రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లోని మదర్ డెయిరీ సరఫరా చేస్తున్న నెయ్యినే వాడుతున్నారు. గత 30 ఏళ్లుగా అదే సహకార సంస్థ (నార్మూల్)కు చెందిన నెయ్యి కొనుగోలు కొనసాగిస్తోంది. గతంలో విజయ డెయిరీ, విజయవాడ వారి దుర్గా నెయ్యిని ఖరీదు చేశారు. రంగారెడ్డి, నల్గొండ ఉమ్మడి జిల్లాలకు చెందిన పాల ఉత్పత్తి దారుల సంక్షేమం దృష్ట్యా, జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధుల సూచనలతో మదర్ డెయిరీ నెయ్యిని వినియోగిస్తున్నట్లు శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవో భాస్కర్‌రావు స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే అయిలయ్య మాటల్లో..
విజయ డెయిరీ, మదర్ డెయిరీ వీటిని అభివృద్ధి పర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. నల్గొండ, రంగారెడ్డి జిల్లాలకు చెందిన పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి సహకరించే లక్ష్యంతో మదర్ డెయిరీకి చెందిన నెయ్యిని ఖరీదు చేయాలి.


యాదాద్రీశుడి లడ్డూ ప్రసాదం



సీల్ వేసిన క్యాన్లలో మదర్ డెయిరీ నెయ్యి

పల్లె గల్లా.. ఖాళీ..!





నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలను నిధుల కొరత వేధిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని నెలలుగా పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. ముఖ్యంగా ఆదాయ వనరులు అంతగా లేని చిన్న పంచాయతీల్లో కనీసం కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి. గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛదనం- పచ్చదనం, త్వరలో నిర్వహించే బతుకమ్మ, దసరా పండగ సంబరాలకు నిధుల లేమి సమస్యగా మారనుందని పంచాయతీ కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



జిల్లా	పంచాయతీలు	మండలాలు	చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు (సుమారు)
నల్గొండ	868	33	రూ. 45 కోట్లు
సూర్యాపేట	486	23	రూ. 20 కోట్లు
యాదాద్రి	428	17	రూ. 14 కోట్లు

గాడితప్పిన పాలన..

గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం ఫిబ్రవరి 2న ప్రత్యేకాధికారులను నియమించింది. నిధుల లేమి, సిబ్బంది జీతాల చెల్లింపుల్లో జాప్యం కారణంగా పంచాయతీ పాలన గాడితప్పుతోంది. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మురుగు కాలువల్లో పూడికతీత, విద్యుత్తు దీపాల ఏర్పాటు, తాగునీటి పైపులైన్‌ల లీకేజీలు, ట్రాక్టర్లకు డీజిల్ కొరత ఇలా.. అనేక సమస్యలు రాజ్యమేలుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. ప్రత్యేకాధికారులు సైతం చేసేదేమీ లేక పంచాయతీలను పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

జాడలేని ఎస్ఎఫ్‌సీ నిధులు

ఈ ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు కొద్ది మేర గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమయ్యాయి. వాటితో పంచాయతీ కార్యదర్శులు కొన్ని నెలలుగా నెట్టుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎస్ఎఫ్‌సీ (స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్) నిధులు సైతం గత కొన్ని నెలలుగా విడుదల కాలేదు. గతంలో సర్పంచులు గ్రామాల్లో చేసిన పనులకు సైతం బిల్లులు చెల్లించాల్సి ఉంది.

✦ బ్లీచింగ్, వీధిలైట్లు, చేతిపంపుల సామగ్రి కొనుగోలు, పంచాయతీ నిర్వహణ ఖర్చులు ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ప్రత్యేకాధికారులు పంచాయతీ పాలనను పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో పూర్తిస్థాయిలో బాధ్యతలు పంచాయతీ కార్యదర్శులపై పడటంతో వారు అప్పులు చేసి పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

మానసిక ఉల్లాసం.. విజ్ఞాన వికాసం

శివలింగంపై.. నేరుగా సూర్యకిరణాలు



నేరేడుచర్ల: చారిత్రక భృగుమాలికా సోమేశ్వరాలయం

కాకతీయులు, రెడ్డిరాజుల పూజలందుకున్న చారిత్రక సోమప్ప దేవాలయం ఎన్నో ప్రత్యేకతలకు నిలయం. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం సోమారం, బూర్గులతండా గ్రామపంచాయతీల పరిధిలో మూసీనది తీరంలో ఉన్న ఈ ఆలయంలో ఏటా రెండు, మూడు రోజుల పాటు సూర్యకిరణాలు శివలింగంపై పడతాయి. ఈ ఆలయం వద్ద పెద్ద సొరంగ మార్గం ఉంది. అది శ్రీశైలం దాకా ఉందని చెబుతారు. ఆలయం రాతి స్తంభాలతో అద్భుత నిర్మాణశైలితో నిర్మిత మైంది. ఆలయం ఎదుట నిర్మించిన ముఖద్వారం ఆకర్షణీయంగా కన్పిస్తుంది. 13వ శతాబ్దంలో దేవనాగరి లిపిలో రాజులు వేసిన ఆరు శిలా శాసనాలు కన్పిస్తాయి.

కల్పించాల్సిన సదుపాయాలు..

మూసీనదిలో భక్తులు పుణ్యస్నానాలు చేయడానికి ఘాట్ నిర్మించాలి. మిర్యాలగూడ నుంచి చిల్లేపల్లి మీదుగా సూర్యాపేట వెళ్లే రోడ్డును ఇప్పటికే డబుల్ రోడ్డుగా మారుస్తున్నారు. ఈ మార్గంలో బూర్గులతండా నుంచి 2 కిలోమీటర్ల దూరంలో సోమప్ప దేవాలయం ఉంది. ఈ రెండు కిలోమీటర్లు రెండు వరుసల తారు రోడ్డు నిర్మించాలి. ఆలయం వద్ద భక్తులకు మరికొన్ని మెరుగైన వసతులు కల్పించాలి. – న్యూస్‌టుడే, నేరేడుచర్ల, చిలుకూరు

❑ నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



పర్యాటక ప్రదేశాల సందర్శనలో ఎంజీయూ విద్యార్థులు

పర్యాటక రంగానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. పర్యాటక ప్రదేశాలను సందర్శించడం ద్వారా మానసిక ఉల్లాసం పొందడంతో పాటుగా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. సందర్శించే ప్రాంతాల్లోని ప్రజల సంస్కృతి, జీవనోపాధి తెలుసుకోవచ్చు. దేశంలోని ఆయా రాష్ట్రాల్లో రోజురోజుకి పర్యాటక రంగ అభివృద్ధి ఎంతో ముందుకెళ్తుంది. ఇంతటి ప్రాధాన్యతా రంగంపై నేటి యువత ఆసక్తి చూపుతున్నారు. పీజీ స్థాయిలో టూరిజం కోర్సులు పూర్తిచేసి అందివస్తున్న ఉపాధి అవకాశాలను పొందుతున్నారు. ప్రధానంగా పర్యాటక ప్రదేశాల్లోని హోటల్స్ మేనేజర్లుగా, టూర్ గైడ్‌లుగా, టూర్ ఆపరేటర్లుగా, ఈవెంట్ మేనేజర్లుగా, టూరిజం శాఖలో ఆయా కొలువులు సాధించి స్థిరపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రదేశాల్లో ఏటా సందర్శకుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. –నల్గొండ టౌన్, న్యూస్‌టుడే:

పర్యాటక రంగానికి ప్రాధాన్యం

మారం వెంకటరమణారెడ్డి, ఎంజీయూ ఎంబీఏ టీటీఎం హెచ్‌వోడీ




పర్యాటకరంగానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో పర్యాటకరంగం ఎంతో అభివృద్ధి సాధిస్తుంది. వర్సిటీలో ఎంబీఏ టీటీఎం కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఆయా పర్యాటక సంస్థల్లో మంచి ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ కోర్సు చదివేందుకు మక్కువ చూపాలి. నల్గొండ జిల్లాలో మంచి పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వాటిని అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య పెరగడంతో పాటుగా యువతకు ఉపాధి లభిస్తుంది.

ఎంజీయూలో టూరిజం కోర్సు

ఎంబీఏ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ కోర్సు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక్క ఎంజీయూలోనే ఉంది. ఇక్కడ ప్రతి ఏటా 60 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందుతారు. కోర్సును వర్సిటీలో 2009లో ప్రారంభించారు. ఇప్పటి వరకు 12 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు ఈ కోర్సు పూర్తిచేసి టూరిజం పరిధిలోని ఆయా సంస్థల్లో కొలువులు చేస్తున్నారు. మరికొందరూ సొంతంగా టూరిజం కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో చూడదగ్గ ప్రదేశాలు



పిల్లలమర్రి ఎరకేశ్వర ఆలయం

భువనగిరి కోట, యాదాద్రి క్షేత్రం, కొలనుపాక జైన దేవాలయం, ఫణిగిరి బౌద్ధ స్తూపం, పిల్లలమర్రి ఎరకేశ్వర ఆలయం, మట్టపల్లి, మేళ్లచెరువు, జాన్‌పహాడ్ ఆధ్యాత్మిక క్షేత్రాలు, వాడపల్లి శివాలయం, పానగల్ ఛాయా సోమేశ్వరాలయం, వైజాగ్ కాలనీ, నాగార్జునసాగర్, బుద్ధవనం, దేవరకొండ కోట, బుగ్గ జలపాతాలు జిల్లాలో తప్పకుండా చూడాల్సిన ప్రాంతాలు.

✦ గత మూడేళ్లలో ఉమ్మడి జిల్లాలోని బుద్ధవనం, ఫణిగిరి, భువనగిరి కోటకు సుమారు రూ.400కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. యాదాద్రి క్షేత్రానికి సమీపంలోని బస్వాపూర్ రిజర్వాయర్‌ను సైతం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

కొత్త అందాలు తెరపైకి:

నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం అజలాపురం గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో పచ్చని కొండల నడుమ కొన్నేళ్ల క్రితమే తెరపైకి వచ్చిన బుగ్గ జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది. నల్గొండ నయాగారాగా పేరు గాంచిన ఈ జలపాతం వర్షాలు పడే సమయంలో ప్రజలకు కనువిందు చేస్తుంది. వాడపల్లిలో పురాతన శివాలయం, సమీపంలోని కృష్ణా, మూసీ నదుల సంగమ ప్రాంతం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటుంది.

ఆధ్యాత్మిక క్షేత్రాలు..

ఆలేరు సమీపంలోని పురాతన కొలనుపాక జైన దేవాలయం నుంచి సూర్యాపేట జిల్లాలోని బౌద్ధ మత ఆనవాళ్లకు నిలయంగా ప్రసిద్ధి గాంచిన ఫణిగిరి బౌద్ధ క్షేత్రం, పురాతన శివాలయం దర్శనంతో పాటు ప్రకృతి అందాల పిల్లలమర్రి ఎరకేశ్వర ఆలయం, మట్టపల్లి, మేళ్లచెరువు, జాన్‌పహాడ్ ఆధ్యాత్మిక క్షేత్రాలు సైతం జిల్లాలో చూడదగ్గ ప్రదేశాలు.

– న్యూస్‌టుడే, మిర్యాలగూడ పట్టణం

ఉమ్మడి జిల్లాలో..

కొలనుపాక జైన మందిరం, మ్యూజియం, దేవరకొండ, రాచకొండ కోటలు, నాగార్జున సాగర్, బుద్ధవనం, పచ్చల, ఛాయ సోమేశ్వర ఆలయం పానగల్లు, ఇలా మరిన్ని పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వీటి సందర్శనకు యేటా వేలాది మంది ఆయా ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఈ ప్రదేశాల్లో టూర్ గైడ్‌లుగా పనిచేసే అవకాశం ఆసక్తి గల యువత లభిస్తాయి.

ఇష్టంతో చదువుతున్నా

మనీషా, ఎంజీయూ విద్యార్థిని



నేను ప్రస్తుతం ఎంజీయూలో ఎంబీఏ టీటీఎం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. ఎంతో ఇష్టంతో ఈ కోర్సు చదువుతున్నా. కోర్సులో చేరిన నాటి నుంచి పర్యాటరంగంపై ఎంతో అవగాహన పొందాను. వివిధ రాష్ట్రాల్లోని పర్యాటక ప్రదేశాలను వీక్షించి అక్కడి సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకున్నాను. కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు ఎన్నో కొత్త విషయాలపై విజ్ఞానాన్ని పెంపొందించుకున్నాను.

కాలువలో గల్లంతైన వారిలో ఒకరి మృతదేహం లభ్యం



నిడమనూరు, న్యూస్‌టుడే: సాగర్ ఎడమ కాలువలో దుస్తులు ఉతకడానికి వెళ్లి త్రిపురారానికి చెందిన కూరగాయల దుకాణం యజమాని వేమవరపు సాయి(25), ఆ దుకాణంలో పనిచేసే మేదరి శైలజ (24) ప్రమాదవశాత్తు బుధవారం కాలువలో పడి గల్లంతయ్యారు. గల్లంతైన ఇద్దరిలో ఒకరైన శైలజ మృతదేహం గురువారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో త్రిపురారం మండలం కంపసాగర్ వద్ద లభ్యమైంది. ఆమె మృతదేహం తేలి నీటిలో కొట్టుకుపోతున్న విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి బయటకు తీయించారు. మరో వ్యక్తి సాయి ఆచూకీ ఇంత వరకు లభ్యం కాలేదు.

☛ కాలువలో బుధవారం గల్లంతైన వేమవరపు సాయి, మేదరి శైలజ ఆచూకీ గురువారం మధ్యాహ్నం వరకు లభ్యం కాకపోవడంతో, కాలువకు నీటి విడుదల నిలిపి వేయాలని వారి బంధువులు మొదట ముకుందాపురం వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. పోలీసులు వారితో మాట్లాడి ధర్నా విరమింపజేశారు.

అమ్మ కావాలి..

త్రిపురారం: అమ్మ కావాలి.. అంటూ బోరున విలపిస్తున్న ముగ్గురు చిన్నారులను చూసి కంటతడి పెట్టని వారు ఎవరూ ఉండరు. శైలజకు ముగ్గురు కుమార్తెలు. మేదరి అని (12) 7వ తరగతి, మిల్కి(10) 6వ తరగతి, జ్యోష్న ప్రియ (8) 4వ తరగతి చదువుతున్నారు. తల్లి మరణవార్త తెలియగానే వారు అమ్మ కావాలని బోరున విలపిస్తుండటంతో వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. విషయం తెలిసిన వారంతా పెద్ద సంఖ్యలో మృతురాలి ఇంటి దగ్గరికి చేరుకుని కన్నీటి పర్యంతమవుతున్నారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి

భూదాన్‌పోచంపల్లి:నీటిసంపులో పడి బాలుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని రామ్‌నగర్‌కాలనీలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై భాస్కర్‌రెడ్డి కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రంలోని పుట్నియా జిల్లా బర్హారా గ్రామానికి చెందిన అర్జున్‌దాస్ ఉపాధి నిమిత్తం పోచంపల్లిలో నివాసం ఉంటున్నాడు. గురువారం అర్జున్‌దాస్ పని నిమిత్తం బయటకు వెళ్లాడు. తల్లి నిద్రిస్తున్న సమయంలో కరణ్‌కుమార్(13నెలలు) సోదరుడితో కలిసి ఆడుకుంటూ ఇంటి ఆవరణలోని నీటిసంపులో పడి మునిగిపోయాడు. అదే సమయంలో పక్క ఇంట్లో అద్దెకు ఉంటున్న సంతోష్ ఇంటికి రావడంతో బాలుడి సోదరుడు సంపులో పడిపోయాడని తెలిపాడు. వెంటనే బాలుడిని సంపులో నుంచి తీయగా అప్పటికే మృతిచెందాడు. మృతదేహాన్ని మరణోత్తర నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



అదనపు కలెక్టర్ కాళ్లు మొక్కుతున్న రైతు అయిలయ్య

నియంత్రిక మంజూరు చేయాలని..

గుండాల, న్యూస్‌టుడే: లో ఓల్టేజీ కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని, నియంత్రిక మంజూరు చేయాలని ఏడాదిగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఓ రైతు జిల్లా అదనపు కలెక్టర్ కాళ్ల మీద పడిన ఘటన గురువారం గుండాల మండల తహసీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకుంది. అధికారులు కార్యాలయ సందర్శనకు వచ్చిన సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన రైతు గోపాల్‌దాసు అయిలయ్య లోఓల్టేజ్ విద్యుత్తు సమస్య ఉందని విద్యుత్తు అధికారులను సంప్రదించగా నియంత్రిక మంజూరుకు డీడీ చెల్లించాలని సూచించారు. డీడీ తీసి ఏడాది దాటినా నియంత్రికను మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నారని రైతు అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ కాళ్ల మీద పడి తన సమస్య వివరించారు. స్పందించిన అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. త్వరిత గతిన సమస్య పరిష్కరిస్తామని రైతుకు హామీ ఇచ్చారు.

బంగారం ఆశ చూపి.. రూ.లక్షలు కాజేసి

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: బంగారం ఆశ చూపి రూ.లక్షలు దోచుకుంటూ, పిల్లలు ఆడుకునే రూ.500 నోట్లను అమాయకులకు అంటగట్టి మోసం చేస్తున్న ముఠాను హుజూర్‌నగర్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

✧ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండలం మోదుగుండ్ల గ్రామానికి చెందిన సోదరులు నోముల ప్రకాష్, మత్స్యగిరి వ్యాపారంలో నష్టపోయారు. సులువుగా డబ్బులు సంపాదించాలని భావించి వారికి తెలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం అనుపాలేనికి చెందిన తాపీ మేస్త్రీ కొమెర రత్తయ్య అలియాస్ తిరుపతిరెడ్డి, బెల్లంకొండ మండలం మాసపాలెం కాలనీకి చెందిన బత్తుల రేణు, డేరంగుల కృష్ణవేణి మొత్తం ఐదుగురు కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరందరూ నకిలీ బంగారాన్ని అమ్మి డబ్బులు సంపాదించుకోవాలనుకున్నారు.

✧ ఈ క్రమంలో కొమెర రత్తయ్య, రేణు కలిసి సత్తెనపల్లిలో కొన్ని నకిలీ బంగారు బిస్కెట్లు తయారు చేయించారు. మునగాల మండలం నారాయణగూడెం గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గోపిరెడ్డి వెంకటరెడ్డిని ఈనెల 2న ప్రకాష్ కలిసి తన బంధువులు పాత ఇంటిని కూల్చివేస్తుండగా రెండు బంగారు బిస్కెట్లు దొరికాయని, వాటిని తక్కువ ధరకు తీసుకుందామని చెప్పి సాగర్ సిమెంట్ పరిశ్రమ మైన్స్‌కు వెళ్లే దారిలోకి తీసుకెళ్లాడు. రత్తయ్య నుంచి నకిలీ బంగారు బిస్కెట్లు తీసుకుందామని చెప్పి ప్రకాష్ తన వాటా కింద చిన్న పిల్లలు ఆడుకునే కాగితపు కరెన్సీతో వెళ్లి వెంకటరెడ్డి నుంచి రూ.7 లక్షలు తీసుకొని అతడికి బంగారం ఇవ్వకుండా పారిపోయారు. వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు మఠంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

✧ ఈ ముఠానే జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన మాతంగి శ్రీనుకు బంగారం ఆశ చూపి అతడిని హుజూర్‌నగర్ పట్టణానికి రమ్మని చెప్పి అతడి నుంచి రూ.10 వేలు తీసుకున్నారు. శ్రీనుకు కూడా బంగారం ఇవ్వకపోవడంతో 24న హుజూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఘటనలపై సీఐ చరమందరాజు విచారణ చేశారు. మాతంగి శ్రీనును గురువారం మఠంపల్లి రోడ్డులోని ఓ పెట్రోల్ బంకు వద్దకు డబ్బులు తీసుకొని వస్తే బంగారం ఇస్తామని చెప్పడంతో సీఐ సూచనల మేరకు ఉదయం డబ్బులతో వెళ్లగా.. అక్కడకు వచ్చిన నోముల ప్రకాష్, మత్స్యగిరి, కొమెర రత్తయ్యలు మాతంగి శ్రీనుకు నకిలీ బంగారం ఇస్తుండగా సీఐ చరమందరాజు సిబ్బందితో కలిసి పట్టుకున్నారు.

✧ పట్టుబడిన నేరస్థులు ఇచ్చిన సమాచారంతో కోదాడ పట్టణంలోని ఆర్కే లాడ్జిలో ఉన్న డేరంగుల కృష్ణవేణి, బత్తుల రేణులను పట్టుకున్నారు. వీరి నుంచి రూ.7 లక్షల నగదు, రెండు ద్విచక్రవాహనాలు, ఒక ఆటో, 9 చరవాణులను, చిన్నపిల్లలు ఆడుకునే 761 కాగితపు రూ.500 నోట్లు (రూ.3,80,500 విలువ), మూడు నకిలీ బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్సైలు ముత్తయ్య, నరేష్, ఏఎస్సై బలరాంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



నల్గొండ: అంబేడ్కర్ భవన్‌లో జర్నలిస్టుల వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

ప్రజాభిప్రాయం ప్రకారం వార్తలు రాయాలి

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజాభిప్రాయం ప్రకారం నిజ నిర్ధారణ చేసుకొని వార్తలు రాస్తే బాగుంటుందని జిల్లా అదనపు పాలనాధికారి పూర్ణ చంద్ర అన్నారు. నల్గొండలో గురువారం జర్నలిస్టులకు ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో పాల్గొని మాట్లాడారు. సంచలన వార్తలకి ప్రాధాన్యం ఇవ్వకుండా సమాజానికి అవసరమయ్యేవాటికి సముచిత స్థానం కల్పిస్తే సమాజ మార్పునకు నాంది కావొచ్చన్నారు. జర్నలిజంలో నిరంతరం మనల్ని మనం నవీకరించుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్ డిప్యూటీ ఎస్పీ టి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి రోజు సుమారు రూ.5,6 కోట్లలో సైబర్ మోసాల వల్ల నష్టపోతున్నారన్నారు. నేరాల్లో బాధితులు, నేరస్థులు ఉండేవారని.. కానీ ఇప్పుడు సైబర్ క్రైమ్‌లో నేరస్థులు ఎక్కడో ఉండి మనకు చేయాల్సిన నష్టం చేస్తూనే ఉంటారన్నారు. నష్టపోతున్నవారిలో ఉన్నత విద్యావంతులే 90 శాతానికి పైగా ఉన్నారన్నారు. ప్రతి జిల్లాలో సైబర్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పీఐబీ డిప్యూటీ డైరెక్టర్ మానస్ కృష్ణకాంత్, దిలీప్ కుమార్‌రెడ్డి, సైంటిస్ట్ జగదీష్ బాబు, జిల్లా ఫీల్డ్ పబ్లిసిటి అధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

28న ఉమ్మడి జిల్లాస్థాయి కుస్తీ పోటీలు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: నల్గొండ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 28న ఉమ్మడి అండర్-14, 17 బాలబాలికల జిల్లా స్థాయి కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

బీఈడీ ద్వితీయ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ రెండవ సెమిస్టర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. నల్గొండలో పలు పరీక్ష కేంద్రాలను ఎంజీయూ సీవోఈ ఉపేందర్‌రెడ్డి పరిశీలించారు. మొదటి రోజున పరీక్షకు 2469 మంది విద్యార్థులు హాజరయ్యారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

రజితది హత్యా..? ఆత్మహత్యా..?

గుర్రంపోడు, న్యూస్‌టుడే: గుర్రంపోడు మండలం ముల్కలపల్లి వివాహిత మృతి కేసులో కీలక మలుపులు వెలుగు చూస్తున్నట్లు తెలుస్తోంది. రజితది హత్యా, ఆత్మహత్యా అన్న సందేహాల మధ్య విచారణ చేపట్టిన జిల్లా పోలీసు ఉన్నతాధికారులు హత్యేనని నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఆగస్టు 29న రాత్రి ఇంట్లో ఉరివేసుకుని చనిపోయిన వివాహిత జాల రజిత కేసులో పోలీసులు తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనంతరం ఆత్మహత్యగా నమోదు చేయటంతో మృతురాలి బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న నిందితుల పేర్లను తొలగించిన పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు చోటు చేసుకున్నాయి. ఈ వ్యవహారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో జిల్లా ఎస్పీ స్పందించి ఈ ఘటనపై జిల్లా అదనపు ఎస్పీ రాములునాయక్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన విచారణలో పలు ఆసక్తికర అంశాలు వెలుగు చూస్తున్నట్లు చెబుతున్నారు. ఘటనాస్థలంలో మృతదేహం చూడగానే హత్యగానే భావించినప్పటికీ తర్వాత ఆత్మహత్యగా కేసు నమోదు చేయటం వెనుక ఎలాంటి అంశాలున్నాయన్న కోణంలో అదనపు ఎస్పీ విచారణను చేపట్టారు. భర్త ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న నలుగురిని విచారించడంతో ఆత్మహత్య కాదని నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా నిందితుల నుంచి స్థానిక పోలీసులకు పెద్దమొత్తంలో డబ్బు చేతులు మారినట్లు వచ్చిన ఆరోపణలపై దృష్టి సారించిన పోలీసు ఉన్నతాధికారులు నిజ నిర్ధారణకు వచ్చినట్లు భావిస్తున్నారు. త్వరలోనే విచారణను పూర్తి చేసి కీలక సూత్రధారుల గుట్టును బయటపెట్టేందుకు జిల్లా ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పదహారేళ్లకు.. సర్కారు కొలువులోకి..!

నల్గొండ విద్యావిభాగం, నడిగూడెం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2008లో నష్టపోయిన అభ్యర్థులకు ఒప్పంద పద్ధతిలో ఎస్జీటీలుగా నియమించేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో నష్టపోయిన వాళ్లు 391 మంది ఉన్నారు. దాదాపు 16 ఏళ్ల తరువాత సమస్య పరిష్కారం అయింది. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో డీఎస్సీ- 2008 అభ్యర్థులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ఒప్పంద విధానంలో నెలకు రూ.31,080 వేతనం చొప్పున చెల్లించి ఎస్జీటీ ఉద్యోగాలు ఇచ్చేందుకు నిర్ణయించింది.

✦ బాధితులు ఉమ్మడి నల్గొండ జిల్లాలో 391 మంది ఉన్నా.. ఆ తర్వాత జరిగిన డీఎస్సీ, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో ప్రస్తుతం 270 మంది వరకు మిగిలి ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. చాలా మంది వివిధ పనులు, వ్యాపారాల్లో నిమగ్నమయ్యారు. 1967-69 మధ్య కాలంలో పుట్టిన వాళ్లు కూడా ఈ డీఎస్సీ రాశారు. ఇప్పటికే వారిలో కొంత మందికి 57 ఏళ్లు దాటాయి. ఎక్కువ మంది 50 ఏళ్ల వయస్సుకు దగ్గర్లో ఉన్నవాళ్లే ఉద్యోగంలో చేరనుండటం గమనార్హం.

నేటి నుంచి పత్రాల పరిశీలన..

డీఎస్సీ- 2008 అభ్యర్థులను ఒప్పంద పద్ధతిలో నియమించేందుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీచేసినట్లు డీఈవో బి.భిక్షపతి తెలిపారు. సంబంధిత అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు పాఠశాల విద్యా తెలంగాణ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూస్కూల్ ఎడ్యు.తెలంగాణ.జీవోవి.ఇన్ నందు దరఖాస్తు ఫారం, అభ్యర్థుల జాబితా పొందుపరిచారని చెప్పారు. తమ ధ్రువీకరణ పత్రాల పరిశీలన కోసం శుక్రవారం నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పరిశీలన చేయించుకోవాలని సూచించారు.

న్యాయం జరిగింది: మహ్మద్ షరీఫ్, కరివిరాల



డీఎస్సీ పరీక్షకు హాజరై కొలువుకు అవసరమైన మార్కులు సాధించినా.. డీఈడీ అభ్యర్థులకు ఎస్జీటీ పోస్టులు కేటాయించడంతో చివరి నిమిషంలో తీవ్ర అన్యాయం జరిగింది. 15 ఏళ్లుగా సుదీర్ఘ పోరాటం చేశాం. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని ఎట్టకేలకు 48 ఏళ్ల వయస్సులో కొలువుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

ఆశ వదులుకున్నా: నాగరాజు, వెంకట్రాంపురం



ఎంఏ, బీఈడీ పూర్తి చేశాను. డీఎస్సీలో చివరి నిమిషంలో ఉద్యోగం చేజారింది. అప్పటి నుంచి ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రభుత్వ కొలువు రాలేదు. చేసేది లేక ఇంటర్‌నెట్ సెంటర్ ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాను. న్యాయస్థానం తీర్పుతో ప్రభుత్వం కనీసం కాంట్రాక్టు పద్ధతిలోనైనా కొలువులకు ఎంపిక చేసినందుకు ఆనందంగా ఉంది.

నట్టల నివారణ ఏమాయె..!

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు లేక అనారోగ్యం బారిన పడుతున్నాయి. ప్రతి సంవత్సరం ప్రభుత్వం సరఫరా చేయాల్సిన మందులు సరఫరా కావడం లేదు. దీంతో జీవాల పెంపకందారులు ప్రైవేట్‌గా కొనుగోలు చేస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది.

✦ ఉమ్మడి జిల్లాలో 23.21 లక్షల గొర్రెలు, 5.86 లక్షల మేకలు ఉన్నాయి. వాటికి నట్టల నివారణకు ఏటా రెండు సార్లు పశుసంవర్ధక శాఖ అధికారులు నట్టల మందులను జీవాలకు వేస్తారు. ప్రభుత్వం గత రెండేళ్లుగా వాటిని సరఫరా చేయడం లేదు. వానాకాలం సీజన్ ప్రారంభంలో ఆ తర్వాత సీజన్ ముగిసి నీరు ఇంకిపోయే దశలో నట్టల వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుంది. నట్టల ముందు వేయడం వల్ల జీవాలు ఆరోగ్యంగా ఉంటాయి.

వచ్చిన వెంటనే వేస్తాం.. జూలకంటి వెంకటరెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి. నల్గొండ

ప్రస్తుతం గొర్రెల, మేకలకు కావాల్సిన నట్టల నివారణ మందులు అందుబాటులో లేవు. ప్రభుత్వం నుంచి సరఫరా కావట్లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి రాగానే పంపిణీ చేస్తాం.

గొర్రెలు, మేకల సంఖ్య..

జిల్లా	గొర్రెలు	మేకలు
నల్గొండ	912625	336182
సూర్యాపేట	779920	140000
యాదాద్రి	628600	110000

ఆరోగ్య కార్డులు అందజేయాలని ఉత్తరాలు

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: బార్ కౌన్సిల్‌లో 2019 తర్వాత నమోదైన న్యాయవాదులకు హెల్త్ కార్డులు అందజేయాలని భువనగిరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసుపునూరి హరినాథ్, ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆరోగ్య కార్డుల కోసం సీఎం రేవంత్‌రెడ్డికి, న్యాయశాఖ కార్యదర్శికి ఉత్తరాలు రాసి పంపించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు కలకుంట్ల జయ, సహాయ కార్యదర్శి మట్ట వెంకటేశ్వర్లు, న్యాయవాదులు పిడుగు ఐలయ్య, ఆకుల మల్లేష్, కె.నరేష్, విద్యాసాగర్, జంగయ్య, చంద్రశేఖర్, పల్లెర్ల నరహరి, చేగూరి ఐలయ్య, ప్రభాకర్, ప్రసాద్, కిషన్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో ఇబ్బందులు రావొద్దు

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: మంచినీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని మిషన్ భగీరథ చీఫ్ ఇంజినీర్ లలిత అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో గ్రామ మంచినీటి సహాయకులకు నాలుగు రోజుల శిక్షణ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పైప్‌లైన్, గేట్‌వాల్వు లీకేజీల మరమ్మతులపై శిక్షణ అందించారు. కార్యక్రమంలో వై.కృష్ణయ్య, భువనగిరి డివిజన్ ఏఈ కరుణాకర్, గ్రిడ్ ఈఈ లక్ష్మీనారాయణ, డీఈఈ దీన్ దయాళ్, ఏఈఈలు సాయినాథ్, శ్వేత పాల్గొన్నారు.

రుణమాఫీకి కుటుంబ నిర్ధారణ చేయించుకోవాలి

ముఖాముఖి

☛ 'న్యూస్‌టుడే'తో ఆలేరు ఏవో శ్రీనివాస్‌గౌడ్



ఇటీవల కురుస్తున్న వర్షాలకు వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రైతులు పంటల రక్షణకు ప్రత్యేక దృష్టిని సారించాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా పంటలు నష్టపోవాల్సి రావడంతో పాటు దిగుబడి తగ్గే పరిస్థితులు ఉంటాయి. వరిచేలు పొట్టదశలో ఉన్న ప్రస్తుత సమయంలో అవసరమైన మేర నీటిని అందించాలి. తెలుపు రేషన్ కార్డులేక పంట రుణాలు మాఫీకాని కాని రైతులు కుటుంబ నిర్ధారణ చేయించుకోవాలని ఆలేరు మండల వ్యవసాయాధికారి సూదగాని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. న్యూస్‌టుడే 'ముఖాముఖి'లో రైతులకు పలు సూచనలు చేశారు. ఆ వివరాలు మీకోసం..

– ఆలేరు, న్యూస్‌టుడే

ఈ-పోస్ యంత్రాలు..

ఎరువుల దుకాణాల్లో ఈ-పోస్ యంత్రాలతోనే ఎరువుల విక్రయాలు జరుగుతున్నాయి. మాన్యువల్‌గా విక్రయాలు జరిపితే చర్యలు తప్పవు. ఈ-పోస్ యంత్రాల పనితీరు బాగుంది. ఎరువుల విషయంలో ఎలాంటి కొరత లేదు.

వరి, పత్తికి తెగుళ్లు.. నివారణ చర్యలు...

ఇటీవలతో వరి, పత్తి చేలకు వివిధ రకాలు తెగుళ్లు ఆశించాయి. పత్తిపంట ఎర్రబడినట్లు గుర్తించిన వెంటనే 3 గ్రా కార్బండిజమ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మరియు 1 కిలో 13045 లేదా 19,19,19ని కలిపి పిచికారీ చేసే ఆకులు, గూడ రాలకుండా, మొక్క చనిపోకుండా ఉంటుంది.

☛ వరిలో ఆకునల్లి నివారణకు స్పైరోమిస్కిన్ ఎకరాకు 100 మి.లీ లేదా డైకోఫార్ 700 ఎంఎల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలుచు పురుగ నివారణకు పొట్టదశలో కాటాపైడ్రో క్లోరైడ్ 4జీ గుళికలు ఎకరాకు 8కిలోలు లేదా కాటాపైడ్రో క్లోరైడ్ పౌడర్ 400 గ్రాములను 200 లీటర్లలో కలిపి పిచికారీ చేయాలి. లేదా కొరాజిన్ 60మీ.లీలను 200 లీటర్లలో కలిపి పిచికారీ చేయాలి.

పంట రుణాల మాఫీ..

మండలంలో మొదటి మూడు విడతల్లో కలిపి రూ.2లక్షల లోపున పంట రుణం పొందిన 3,947 మంది రైతులకు రూ.28.49 కోట్ల మేర రుణమాఫీ జరిగింది. తెలుపు రేషన్‌కార్డు లేనివారికోసం రూ.2లక్షలకు పైగా పంట రుణాలు పొందిన వారి కోసం క్షేత్ర స్థాయిలో కుటుంబ నిర్ధారణ కార్యక్రమం తుదిదశకు చేరింది. నిర్ధారణ కావల్సిన వారు 1,064 మంది ఉండగా 901 మందికి పూర్తయింది. మరో 163 మంది నిర్ధారణ చేయించుకోవాల్సి ఉంది.

పంటల సాగు...

మండల పరిధిలో ఈసారి 11,555 ఎకరాల్లో వరి సాగయ్యింది. 2,800 ఎకరాలలో సన్న రకాలు సాగుచేశారు. పత్తి 3,600 ఎకరాలు, 256 ఎకరాల్లో కంది, జొన్న ఏడు, మినుములు ఏడు ఎకరాలు, పెసర 20 ఎకరాల్లో సాగయ్యింది. వర్షాల అనుకూలత కారణంగా కిందటి ఏడాది వానాకాలం సీజన్ సాగైన వరికంటే కంటే ఈసారి సుమారు 950 ఎకరాల్లో తక్కువగా సాగు చేశారు.

ఏసీపీ హఠాన్మరణం



యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఎస్పీఎఫ్ ఏసీపీ టీఆర్ ఎల్ రాజు(57) గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం విధులు ముగించుకొని హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో ఉన్న తన నివాసానికి చేరుకున్నారు. గురువారం తెల్లవారు జామున 4:00 గంటల సమయంలో గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. నాలుగు నెలల క్రితమే రాజు అసెంబ్లీ నుంచి యాదగిరిగుట్టకు బదిలీపై వచ్చారు. ఏసీపీకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో రేషన్ డీలర్ మృతి

సంస్థాన్ నారాయణపురం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మండలంలోని వాచ్యాతండాకు చెందిన రేషన్ డీలర్ వాంకుడోతు రత్నానాయక్(78) మృతి చెందారు. పని నిమిత్తం చౌటుప్పల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుడిమల్కాపురం వద్ద గేదె అడ్డురావడంతో కిందపడిపోయారు. తలకు తీవ్ర గాయమవడంతో స్థానికులు చౌటుప్పల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. రత్న మృతిపట్ల పలువురు వ్యాపారులు, గిరిజన నాయకులు సంతాపం తెలిపారు.

గీతకార్మికుడికి తీవ్ర గాయాలు

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరు మండలం కొలనుపాకకు చెందిన మాటూరు నాగరాజు అనే గీత కార్మికుడు గురువారం తాటిచెట్టు పై నుంచి జారి పడగా తీవ్ర గాయాలయ్యాయి. గురువారం ఉదయం కల్లును తీసేందుకు తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. నాగరాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామంలోని గీత పారిశ్రామిక సహకార సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు.

గ్యాస్ సిలిండర్ల దందాలపై దాడులు

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే: భువనగిరి పట్టణంలోని ఆర్బీనగర్‌లో అక్రమంగా గ్యాస్ సిలిండర్ల రీఫిల్లింగ్ చేస్తున్న దుకాణంపై పోలీసులు దాడులు నిర్వహించారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీజ గ్యాస్‌స్టవ్ రిపేర్ సెంటర్ నిర్వహిస్తున్న దాసరి శ్రీనివాస్ గృహ వినియోగ సిలిండర్ల నుంచి చిన్న సిలిండర్లలో గ్యాస్ నింపుతున్నాడు. పోలీసులు తనిఖీలు చేసి పెద్ద సిలిండర్లు, సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

నేతన్నల ధర్నా

భువనగిరి, న్యూస్‌టుడే: భువనగిరి చేనేత సహకార సంఘంలో సభ్యత్వం ఇవ్వాలని నేత కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని చేనేత పారిశ్రామిక కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చెప్పినా తమకు సభ్యత్వాలు ఇవ్వడం లేదని నేత కార్మికులు మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కస్తూరి భిక్షపతి, పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు బింగి భిక్షపతి, అమృతం, ఆంజనేయులు, శంకర్, ప్రభాకర్, రమేష్, నర్సింహ పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులు త్వరితగతిన పూర్తి చేయాలి



తుర్కపల్లి తహసీల్దార్ కార్యాలయంలో దస్త్రాలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టరు బెన్‌షాలోమ్

గుండాల, న్యూస్‌టుడే: ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేసి రైతుల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ బెన్ షోలోమ్ అధికారులను ఆదేశించారు. గురువారం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన భువనగిరి ఆర్డీవో అమరేందర్‌తో కలిసి సందర్శించారు. వివిధ అంశాలపై చర్చించి వారికి సూచనలు చేశారు. తహసీల్దార్ జలకుమార్, నాయబ్ తహసీల్దార్ నీలిమ ఉన్నారు.

తుర్కపల్లి: పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్‌షాలోమ్ కోరారు. తుర్కపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఆయా దస్త్రాలను పరిశీలించారు. ఆర్డీవో అమరేందర్, తహసీల్దార్ దేశ్యానాయక్ పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలోనే మీసేవ నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి ధరణిపై విధి విధానాలు వివరిస్తామని పేర్కొన్నారు. రైతులకు వేగవంతంగా ధరణి సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వయోవృద్ధుల సంక్షేమానికి చర్యలు



ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ చిత్రంలో అధికారులు

భువనగిరి, న్యూస్‌టుడే: వయోవృద్ధుల సంక్షేమానికి అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హన్మంత్ కె.జెండగే అధికారులను ఆదేశించారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అక్టోబరు 1 వరకు నిర్వహించే వారోత్సవాల్లో వారి రక్షణ, హక్కుల పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, అనాథలైన వృద్ధులను గుర్తించి వసతి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమ అధికారి నరసింహారావు, తెలంగాణ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు బాలేశ్వర్, చంద్రశేఖర్, సోమన్న, రమేష్, జ్ఞానేశ్వర్, భిక్షపతి, సీడీపీవోలు శైలజ, జ్యోత్స్న, స్వరాజ్యం, రమ, సమీర మీర్జా పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదాల నివారణకు.. భువనగిరి : రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని రకాల భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హన్మంత్ కె.జెండగే అధికారులను ఆదేశించారు. రోడ్డు భద్రతా కమిటీ సమీక్ష సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించారు. సమావేశంలో రోడ్లు భవనాలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బాలప్రసాద్, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ప్రభాకర్‌రెడ్డి, మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ఇమ్రాన్ అహ్మద్, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీర్లు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరును పునరుద్ధరించాలి

ఆలేరు, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయానికి శ్రీపొట్టి శ్రీరాములు పేరును పునరుద్ధరించాలని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పసుపునూరి వీరేశం అన్నారు. ఆలేరులో గురువారం నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. తెలుగు రాష్ట్ర అవతరణ కోసం ఆత్మ త్యాగం చేసిన మహనీయుడి పేరును తొలగించడం సరికాదన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. అయిత వెంకటేశ్, సముద్రాల సత్యం, మంచన మల్లేశం, గార్లపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దివిస్ పరిశ్రమ తోడ్పాటు అభినందనీయం

వలిగొండ, న్యూస్‌టుడే: సర్కార్ బడుల బలోపేతానికి దివిస్ పరిశ్రమ తోడ్పాటు అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ అన్నారు. గొల్నేపల్లిలో జిల్లా పరిషత్తు ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు దివిస్ పరిశ్రమ సౌజన్యంతో అందించిన రూ.19,67,540తో చేపట్టనున్న ప్రహరీ నిర్మాణ పనులు గురువారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మదర్ డెయిరీ డైరెక్టర్ గూడూరు శ్రీధర్‌రెడ్డి, మాజీ సర్పంచి శివశాంతిరెడ్డి, దివిస్ పరిశ్రమ ప్రతినిధి ఎస్ సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఆండాళు, ప్రధానోపాధ్యాయురాలు పావని, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఆత్మకూరు(ఎం), న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని బ్యాంక్‌కాలనీలో ఇటీవల మృతి చెందిన బూడిద రవిగౌడ్ కుటుంబానికి కాలనీ వాసులు గురువారం రూ.46,500 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బొబ్బల అంజిరెడ్డి, కాలనీ వాసులు మల్లేష్, రామకృష్ణ, సత్తయ్య పాల్గొన్నారు.



ఆత్మకూరు(ఎం)లో ఆర్థికసాయం అందిస్తున్న బ్యాంక్ కాలనీవాసులు

వాట్సప్ గ్రూప్ సభ్యుల సాయం.. సంస్థాన్ నారాయణపురం: మండలంలోని వాయిళ్లపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బండ రాములు ఇటీవలే మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి అండగా నిలవాలని ఆర్థిక సాయం అభ్యర్థిస్తూ గ్రామానికి సంబంధించిన సామాజిక మాధ్యమంలో జినుకల వెంకటేశం పోస్టు చేశారు. స్పందించిన మానవతా వాదులు తోచిన సహాయం చేయడంతో సమకూరిన నగదు రూ. 65,800లను గురువారం బాధిత కుటుంబానికి వాట్సప్ గ్రూపు సభ్యులు అందజేసి మానవత్వం చాటుకన్నారు. పెంటయ్య, అబ్బయ్య, వెంకన్న, అంజయ్య, లింగస్వామి, నర్సింహ, రఘు, సైదులు, శేఖర్ పాల్గొన్నారు.

స్వచ్ఛత అందరిపై బాధ్యత



చౌటుప్పల్‌లో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయిస్తున్న పుర ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: స్వచ్ఛ చౌటుప్పల్‌గా మార్చే బాధ్యత అందరిపై ఉందని పుర ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు పేర్కొన్నారు. గురువారం స్థానిక పుర కార్యాలయం ఎదుట మెప్మా రీసోర్స్ పర్సన్లు, మహిళా సంఘాల అధ్యక్షులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. స్వచ్ఛత హీ సేవ పక్షోత్సవంలో స్థానిక శివాజీనగర్‌లో, చిన్నకొండూరు రోడ్డులో, తంగడపల్లిలో చెత్త కుప్పలను గుర్తించి తొలగించారు. తంగడపల్లిలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కౌన్సిలర్లు మల్లేశ్, రాజు, వార్డు ఆఫీసర్లు సయ్యద్ సలీం, రాణి, పర్యావరణ ఇంజినీర్ రేణుకుమార్ పాల్గొన్నారు.

చౌటుప్పల్: తంగడపల్లిలోని పీహెచ్‌సీలో చింతలగూడెం, దామెర గ్రామ పంచాయతీల సిబ్బందికి డా.సౌజన్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఔషధాలు పంపిణీ చేశారు. మల్కాపురం, కొయ్యలగూడెం, డి.నాగారం, కుంట్లగూడెం పల్లె దవాఖానాల్లో సైతం శిబిరాలను నిర్వహించారు. ఎంపీవో వి.అంజిరెడ్డి, వైద్యాధికారులు స్వప్న, జయంత్, నరేశ్, ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ, ఆరోగ్య కార్యకర్త వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌గ్రామీణం: దండుమల్కాపురం, తుప్రాన్‌పేట, ఎల్లగిరి, కైతాపురం గ్రామ పంచాయతీల్లో పని చేసే పారిశుద్ధ్య కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరాలను గురువారం నిర్వహించారు. నల్గొండ జిల్లాలో కార్యదర్శులను అక్రమంగా సస్పెన్షన్ చేశారని నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు.

తితిదే గోశాలను నిర్వహించాలి

చౌటుప్పల్, న్యూస్‌టుడే: కోట్లాది భక్తుల మనోభావాలను గుర్తించి తిరుమల వెంకటేశ్వరస్వామి దేవస్థానం గోశాలను నిర్వహించాలని హిందూ ఐక్యవేదిక కార్యకర్తలు చౌటుప్పల్ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం గురువారం అందజేశారు. గోశాలలో పెంచే ఆవు పాలతో తయారు చేసిన నెయ్యిని ఉపయోగించి లడ్డూ ప్రసాదాన్ని తయారు చేయాలని, దేవాలయాల నిర్వహణ బాధ్యతలను ధార్మిక సంఘాలకు అప్పగించాలని కోరారు. విశ్వ హిందూ పరిషత్ జిల్లా నాయకుడు ప్రతాపరెడ్డి, జిల్లా సహకార్యదర్శి శేఖర్, మల్లేశ్, విష్ణుకాంత్, భాజపా నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కృష్ణ, రవి, స్వామి పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న హిందూ ఐక్యవేదిక కార్యకర్తలు

తెగుళ్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలి



చీమలకొండూరు గ్రామంలో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: పంటలను ఆశించే తెగుళ్లను గుర్తించి వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ అన్నారు. జమ్మాపూర్, కూనూరు, చీమలకొండూరు, వీరవెల్లి, బండసోమారం గ్రామాలను వ్యవసాయశాఖ, ఏరువాక, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో గురువారం వివిధ పంటలను సందర్శించారు. రైతులకు సూచనలిచ్చారు. శాస్త్రవేత్తలు డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ మమత, డాక్టర్ లింగయ్య, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ రాములమ్మ, సహాయ వ్యవసాయ సంచాలకుడు వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయాధికారి మల్లేశ్ పాల్గొన్నారు.

మినీ ట్యాంక్‌బండ్‌గా బీబీనగర్ చెరువు



బీబీనగర్ పెద్ద చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్ పెద్ద చెరువు సుందరీకరణలో భాగంగా రూ.10 కోట్ల వ్యయంతో మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. బీబీనగర్ చెరువుకట్ట పటిష్ఠానికి సంబంధించిన పనులను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడుతూ.. బీబీనగర్‌లో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్నచెరువు ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయడానికి అనుకూలంగా ఉందని తెలిపారు. ఇరిగేషన్ ఈఈ ఖుర్షీద్, డీఈ వెంకటస్వామి, ఏఈ శ్రీనివాస్, మండల రెవెన్యూ అధికారి శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు రామాంజనేయగౌడ్, పోట్టోళ్ల శ్యామ్‌గౌడ్, పింగళిరెడ్డి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మల్లగారి శ్రీనివాసులు, మహదేవపూర్ కాంగ్రెస్ నేత ప్రభాకర్, ఆగమయ్యగౌడ్ పాల్గొన్నారు.

☛ బీబీనగర్ మండలం రాఘవాపురంలో బునాదిగాని కాల్వను ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి గురువారం పరిశీలించారు. గుర్రపుడెక్క వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సీనాతండా దగ్గర బొల్లేపల్లి కాల్వను పరిశీలించారు. కాల్వ మరమ్మతులకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. భట్టుగూడెం పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి క్రీడా పోటీల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

విద్యార్థినులకు సన్మానం

యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే: మండల స్థాయి క్రీడా పోటీల్లో చిన్న కందుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. అండర్-14 విభాగంలో ఖోఖో, వాలీబాల్‌లో ప్రథమ, కబడ్డీలో ద్వితీయ, అండర్-17 విభాగంలో ఖోఖోలో ప్రథమ, కబడ్డీ, వాలీబాల్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. గురువారం ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు విద్యార్థులను సత్కరించారు. ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు బుగ్గ కేశనాగులు పాల్గొన్నారు.

అవీ ఇవీ

దుండగులను శిక్షించాలి.. భువనగిరి నేరవిభాగం: పోచంపల్లి మండలం బీమనపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీఎస్పీ జిల్లా ఇన్‌ఛార్జి గంధమల్ల లింగస్వామి డిమాండ్ చేశారు. భువనగిరిలోని స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ఆ పార్టీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. నాయకులు రామచంద్రయ్య, బర్రె నగేష్, బండారు జహంగీర్, సిలువేరు మహేందర్ పాల్గొన్నారు.

ఏబీవీపీ కార్యవర్గం.. మోత్కూరు: మోత్కూరు పట్టణ ఏబీవీపీ కార్యదర్శిగా ఎన్.సాయిహర్షిత్, సంయుక్త కార్యదర్శిగా వినాయక్, ఉపాధ్యక్షులుగా సంజయ్, కె.శివశంకర్, అంచిత, కార్యవర్గ సభ్యులుగా సాయిగణేశ్, వరుణ్, శ్రవణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఉమ్మడి నల్గొండ జిల్లా కన్వీనర్ సూర్య మణికంఠ గురువారం ప్రకటించారు.

సీలింగ్ ఫ్యాను అందజేత.. తుర్కపల్లి: ముల్కలపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాలుయాదవ్ గురువారం సీలింగ్ ఫ్యాను అందజేశారు.

కళాశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ.. భువనగిరి గ్రామీణం: దాతల సహకారం సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని డీసీపీ ఎం. రాజేశ్‌చంద్ర అన్నారు. సురేంద్రపురిలో కుందా సురేంద్ర వర్ధంతిని పురస్కరించుకొని ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు గురువారం బ్యాగులు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎండీ కుందా ప్రతిభ, కుందా ప్రతాప్, కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం డీసీపీని సన్మానించారు.

పంచాయతీ కార్యదర్శుల నిరసన.. చౌటుప్పల్: నల్గొండ జిల్లాలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేసినందుకు చౌటుప్పల్‌లో గురువారం నిరసన చేపట్టారు. స్థానిక మండలంలోని పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించారు. సస్పెన్షన్లను ఎత్తివేయాలని కోరుతూ మండల ప్రజాపరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

కల్వర్టు నిర్మాణాలు సత్వరమే పూర్తి చేయాలి.. రాజపేట: మండలంలో కల్వర్టు నిర్మాణాలు సత్వరమే పూర్తయ్యేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. బేగంపేట, రేణికుంట మధ్యన గల వాగులో కొట్టుకుపోయిన రోడ్డు స్థలాన్ని గురువారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. జిల్లా పాలనాధికారికి ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి చీగుళ్ల లింగం, నాయకులు వెంకటయ్య, కరుణాకర్ తదితరులున్నారు.

మహిళా రైతులకు సరైన గుర్తింపు ఇవ్వాలి .. బొమ్మలరామారం: వ్యవసాయ రంగంలో పని చేస్తున్న మహిళా రైతులకు సరైన గుర్తింపు ఇవ్వాలని నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్ అన్నారు. గురువారం ప్యారారం గ్రామంలో ధీశాలి రైతు మహిళా ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ఏడో వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. మహిళలను ఏకతాటిపై నడిపిస్తూ వారిని చైతన్య పరిచి ముందు వరసలో నిలపడం చాలా గొప్ప విషయమని గ్రామీణ మహిళా మండలి అధ్యక్షురాలు విజయలక్ష్మిని అభినందించారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సా రూరల్ డెవలప్‌మెంట్ అధికారులు రాజు, కళామణి, మాజీ ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకురాలు శాంతి నిర్మల, వ్యవసాయాధికారి దుర్గేశ్వరి, సీఈవో హరిలాల్ పాల్గొన్నారు.


అభివృద్ధి పనుల శంకుస్థాపన.. సంస్థాన్ నారాయణపురం: మండలంలోని సర్వేల్ గ్రామానికి జిల్లా పరిషత్తు నుంచి మంజూరైన రూ.13 లక్షలతో అంతర్గత మురుగు కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణాల పనులకు జడ్పీటీసీ మాజీ సభ్యురాలు వీరమల్ల భానుమతి గురువారం శంకుస్థాపన చేశారు. షేక్ షబ్బీర్, గుత్తా శేఖర్‌రెడ్డి, వెల్లంకి చంద్రయ్య, యాదయ్య, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌కు పరామర్శ.. బీబీనగర్: బీబీనగర్ మండలం వెంకిర్యాల గ్రామానికి చెందిన రేషన్ డీలర్ బసవయ్య భార్య మణెమ్మ దశదినకర్మ కార్యక్రమం గురువారం నిర్వహించారు. జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజయ్య పాల్గొని మణెమ్మ చిత్రపటం దగ్గర నివాళులర్పించారు. బసవయ్యను పరామర్శించి రూ.50వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

హైకోర్టును ఆశ్రయించిన ట్రిపుల్‌ఆర్ నిర్వాసితులు

వలిగొండ: రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో వలిగొండ మండలం వర్కట్‌పల్లి, గోకారం గ్రామాల్లో భూములు కోల్పోతున్న రైతులు గురువారం హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం అలైన్‌మెంట్ మార్చాలని, లేని పక్షంలో మార్కెట్ ధర ప్రకారం డబ్బులు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేసినట్లు రైతులు నాగెల్లి దశరథ, సోలిపురం జనార్దన్‌రెడ్డి, మెట్టు రవీందర్‌రెడ్డి మాద్గుల వెంకటేశం, సత్యానారాయణ, యాదగిరి భిక్షపతి, నర్సింహ, పంచాక్షరమ్మ చెప్పారు.

ఐలమ్మ అంటేనే ఉద్యమ స్ఫూర్తి



చౌటుప్పల్‌లో చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పుర ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు

చాకలి ఐలమ్మ అంటేనే ఉద్యమ స్ఫూర్తికి నిదర్శనమని రజక సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు మామిడాల సోమయ్య అన్నారు. ఆలేరు, కొలనుపాకల్లో రజక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన జయంతి కార్యక్రమాల్లో మాట్లాడారు. మామిడాల నర్సింహులు, బాలమల్లేశం, అఖిలపక్ష, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు. బొమ్మలరామారం ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో బొమ్మలరామారం మండల కేంద్రంలో, చీకటిమామిడి గ్రామంలో జయంతి జరిపారు. ఆత్మకూరు(ఎం)లో ఆదర్శ రజక సహకార సంఘం నాయకుల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ విగ్రహానికి, మోటకొండూరులో ఐలమ్మ చిత్రపటానికి రజక సంఘం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. మోత్కూరులోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో, పురపాలిక, మండల పరిషత్ తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో, శ్రీకాంత్‌చారి చౌరస్తా వద్ద బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో, అడ్డగూడూరు మండలం లక్ష్మీదేవికాల్వ తదితర గ్రామాల్లో ఐలమ్మ జయంతి జరిపారు. భూదాన్‌పోచంపల్లిలో ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేశారు. రాజపేట రజక సంఘం ఆధ్వర్యంలో గాంధీకూడలిలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించినట్లు ఉత్సవ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సట్టు తిరుమలేశ్ తెలిపారు. ఛైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ రామాంజులరెడ్డి ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి వేడుకలు భువనగిరి పురపాలిక కార్యాలయంలో నిర్వహించారు. సంస్థాన్ నారాయణపురంలో శ్రీవెంకటేశ్వర రజక సంఘం ఆధ్వర్యంలో, మండల పరిషత్తు కార్యాలయంలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జయంతి జరిపారు. చౌటుప్పల్ పుర కార్యాలయంలో ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు, రాజస్వ మండలాధికారి, తహసీల్, మండల ప్రజాపరిషత్ కార్యాలయాల్లో ఐలమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వలిగొండ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో చాకలి ఐలమ్మ జయంతి నిర్వహించారు. యాదగిరిగుట్ట అంబేడ్కర్ విగ్రహం వద్ద టీఎమ్మార్పీఎస్ శ్రేణులు, రామన్నపేట మండలం నీర్నెంలలో రజక వృత్తిదారుల సంఘం నాయకులు వేడుకలు నిర్వహించారు. భాజపా భువనగిరి పట్టణ శాఖ ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, భువనగిరి మున్సిపల్ వైస్ ఛైర్మన్ మాయ దశరథ పాల్గొన్నారు. బీబీనగర్ మండలంలోని గూడూరు గ్రామంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



భువనగిరిలో భాజపా నాయకులు..



ఆలేరు: కొలనుపాకలో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అఖిలపక్షం, యువజన సంఘాల నాయకులు

– న్యూస్‌టుడే, బృందం